ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు




పోరంకిలో సంక్రాంతి సంబరాలు చేస్తున్న విద్యార్థులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు తాతాపురం మండల పరిషత్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారి విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలలో సందడి చేశారు. తొలుత పాఠశాలలో దాత తిపుర్నేని రాఘవ ప్రసాద్ భోగి మంటలను వెలిగించి సంబరాలను ప్రారంభించారు. భోగి మంటలు చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు తిరుగుతూ గేయాలు ఆలపించారు. అనంతరం పాఠశాల ఆవరణలో రకరకాల రంగువల్లులను తీర్చి దిద్దారు. చిన్నారి విద్యార్థులకు బోగిపండ్లు పోశారు. పలువురు విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఒక పక్క భోగి మంటలు, మరో పక్క రకరకాల రంగువల్లులు, చెరుకుగడలు, పతంగులతో సంక్రాంతి శోభను ముందే తీసుకొచ్చారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోదావరి సత్యవాణి, ఉపాధ్యాయులు తదిదరులు పాల్గొన్నారు.

పోరంకిలో సంక్రాంతి సంబరాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా చేశారు. గ్రామంలోని విజ్ఞాన్ భారత్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు సంక్రాంతి పండుగలో భాగంగా భోగి మంటలు వేసి పాలు పొంగించారు. హరిదాసు, గంగిరెద్దు, చిన్నారులకు భోగిపళ్లు, సాంస్కృతిక కార్యకలాపాలు, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్ ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బోగి పండ్లు పోస్తున్న హెచ్ఎం సత్యవాణి, ఉపాధ్యాయులు



బోగి మంటలు వెలిగిస్తున్న రాఘవ ప్రసాద్

చినకంచిలో చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి ఆరాధన



చినకంచిలో శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి ఆరాధనలో వేద పండితులు

నున్న(విజయవాడరూరల్): కంచికామకోటి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 30వ ఆరాధనోత్సవం ప్రసిద్ధ చినకంచిలో సోమవారం వైభవంగా జరిగింది. వేద పండితులు మహాన్యాస పూర్వక ఏకాదశమద్రాభిషేకం చేసి స్వామి వారికి భస్మాభిషేకం చేశారు. అనంతరం అలంకరణ అర్చన కార్యక్రమాలను నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలను ఘనంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 32 మంది వేదపండితులను సశాస్త్రీయంగా అర్పించి ఆరాధన కార్యక్రమాన్ని జరిపించారు. భోజనాలు అనంతరం వంద మంది వేదపడితులు వేదసభ నిర్వహించారు. అనురాధ నక్షత్రం కావడంతో అనురాధ స్వస్తి కార్యక్రమం నిర్వహించారు. పల్లడుగు సుబ్రహ్మణ్య శాస్త్రి బాష్యప్రవచనం చేయగా, పోపూరి గౌరీనాథ్ బృందం సంగీత కచేరి జరిపారు.

ఘనంగా మారిమలై పాశుర గానం



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం మారిమలై పాశుర గానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన బృందావనంలోకి శ్రీగోదాదేవి, శ్రీకృష్ణస్వామి వార్ల ఉత్సవమూర్తులను తీసుకొచ్చారు. రత్న సింహాసనంపై వేంచేసియున్న స్వామివార్లకు విశేష అర్చనలు, భక్తి గీతాలు, గోవింద నామస్మరణలతో భక్తులు సేవించారు. అనంతరం దీపకాంతుల మధ్య స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి ఆశీస్సులతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు తెలిపారు. పరిసరా గ్రామాల భక్తులు, ధనుర్మాస గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు.

జంపానకు పడాల పురస్కారం



ఉయ్యూరు: సామాజిక కార్యకర్త , మాజీ సర్పంచ్ జంపాన శ్రీనివాసగౌడ్‌కు స్వాతంత్ర్య సమర యోధుడు పడాల రామారావు స్మారక పురస్కారం లభించింది. సామాజిక సేవ చేస్తున్న ఆయన్ను పురస్కారానికి ఎంపిక చేశారు. పడాల శతజయంతి ఉత్సవాల సందర్భంగా రాజమండ్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నానని ఉయ్యూరులో సోమవారం విలేకరులకు శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు చేతులమీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

ఉంగుటూరు: తోటి ఉద్యోగి కుటుంబానికి మద్యం దుకాణం సిబ్బంది అండగా నిలిచారు. మండలంలోని మానికొండకు చెందిన విశ్వనాథపల్లి రత్నాకర్ నందమూరు వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పని చేస్తుండేవాడు. ఇటీవల రత్నాకర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆ కుటుంబానికి ఎంతో కొంత సాయం చేయాలని తోటి ఉద్యోగులు భావించారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని వైన్‌షాపు ఉద్యోగులు అందరు కలసి రూ.40 వేలు సమీకరించారు. సోమవారం రత్నాకర్ తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేశారు. సాలి సతీష్, వి.రంగధర్, సొంగా రాంబాబు, రాజశేఖర్, మహేష్, కమల్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఇళ్ల నిర్మాణం పేరుతో మోసం

- నకిలీ కాంట్రాక్టర్ అరెస్టు
- 60 మంది లబ్ధిదారుల నుంచి రూ.35 లక్షలు స్వాహా



వివరాలు తెలుపుతున్న ఎస్ఐ యేసేబు

పెనమలూరు: వణుకూరులో లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇళ్ల నిర్మాణం చేస్తానని నమ్మించి వారి వద్ద రూ.35 లక్షలు స్వాహా చేసి మోసం చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేశామని యనమలకుదురు సెక్టార్ ఎస్ఐ యేసుబు తెలిపారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం వణుకూరులో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. తక్కువ సొమ్ముతో ఇళ్ల నిర్మాణం చేస్తానని మొవ్వ మండలం కూచిపూడికి చెందిన కనజం వీరకృష్ణ (అలియాస్ విజయకృష్ణ) లబ్ధిదారులను నమ్మించాడు. పెనమలూరు, కంకిపాడు మండలాల్లో దాదాపు 60 మంది లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఇచ్చిన మెటీరియల్‌తో పాటు లబ్ధిదారుల నుంచి రూ.35 లక్షల సొమ్ము వసూలు చేశాడు. ఆ తరువాత పరారయ్యాడు. ఈ ఘటన పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి నిందితుడి ఆచూకీ తెలుసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. నిందితుడికి చెందిన నాలుగు బ్యాంకు ఖాతాలు సీజ్ చేసి లావాదేవీలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కేసులో సచివాలయ ఉద్యోగుల పై బాధితులు ఆరోపిస్తున్నారని, విచారణలో వారి పాత్ర ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఈ కేసులో ఎవ్వరు ఉన్నా వదిలి పెట్టేదిలేదన్నారు. మోసపోయిన వారు ఇంకా ఎవరైన ఉంటే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వీరకృష్ణ వంటి నకిలీ కాంట్రాక్టర్ల చేతిలో లబ్ధిదారులు మోసపోవద్దని సూచించారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

- ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద ఘటన
- స్వల్ప గాయాలతో బయటపడ్డ ప్రయాణికులు



జాతీయరహదారిపై బోల్తా పడ్డ కారు

కంకిపాడు: జాతీయ రహదారిపై కారు బోల్తా పడ్డ ఘటన మండలంలోని ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద సోమవారం తెల్లవారుఝామున చోటుచేసుకుంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... భీమవరం నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న ఓ కుటుంబం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్దకు చేరుకునే క్రమంలో తీవ్రంగా మంచు కమ్మేయటంతో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే సరికి బాధితులు సమీపంలోని ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం తరలివెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బోల్తా పడ్డ కారును తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి సాలిపేటకు చెందిన పంచుమర్తి సత్యవతి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె తల్లి 2009లో మృతి చెందిన తరువాత నుంచి తండ్రి బి.రామానాయుడు (63) సత్యవతి వద్దే ఉంటున్నాడు. ఆటోనగర్‌లో సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 6వ తేదీన రామానాయుడు పెనమలూరు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న బైక్ అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రామానాయుడికి తీవ్ర గాయాలు అవ్వటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామానాయుడు అదే రోజు మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియలేదు. తండ్రి కనిపించటం లేదని వెతుకుతున్న కుమార్తె సత్యవతికి స్థానిక వలంటీర్ ధనలక్ష్మి ద్వారా సమాచారం తెలిసింది. మృతి చెందింది తన తండ్రేనని సత్యవతి గుర్తించటంతో పోలీసులు ఘటన పై కేసు నమోదు చేశారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువతి పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపారుపూడి మండలం మోపర్రు గ్రామానికి చెందిన యువతి కొంతకాలంగా బాపులపాడు మండలం ఆరుగొలనులోని ఆక్వా కంపెనీలో పనికి వస్తుండగా, దొంతం ప్రశాంత్ అనే యువకుడు వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ రాత్రి డ్యూటీ అనంతరం ఇంటికి తిరిగి వెళ్లుతున్న యువతిపై ప్రశాంత్ మరోమారు లైగింక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే చర్యలు



విద్యుత్ కనెక్షన్‌లను తనిఖీ చేస్తున్న అధికారులు

ఉయ్యూరు: విద్యుత్ అక్రమంగా వినియోగానికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఈఈ డి.కృష్ణానాయక్ తెలిపారు. విద్యుత్ విజిలెన్స్ అధికారుల బృందం సోమవారం ఉయ్యూరులో విస్తృత దాడులు నిర్వహించింది. విజిలెన్స్ డీఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేసిన దాడుల్లో 35 బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడుతూ 2079 గృహ వినియోగ సర్వీసులు, 137 వాణిజ్య సముదాయ సర్వీసులను తనిఖీ చేశామని వెల్లడించారు. 145 సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.4.23 లక్షలు జరిమానా విధించామని వివరించారు. అక్రమ విద్యుత్ వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరు నిబంధనలు అతిక్రమించినా కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. తనిఖీల్లో డీఈ రామకృష్ణ, ఏఈ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వస్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రధాన పూజారి గూడూరు రామలింగ విద్యాసాగర్ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గంటలకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. కాగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు శ్రీ మహానందీశ్వరస్వామివారికి అభిషేకం చేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి గంగాధరరావు తెలిపారు.

ధ్యానంతో ఒత్తిడి నివారణ

పెనమలూరు: విద్యార్థులు ఒత్తిడి గురికాకూడదని చెన్నైకి చెందిన ఏకం ఫౌండేషన్ నిర్వహకురాలు ఆప్తీజీ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఒత్తిడి లేకుండా జీవితం ఎలా గడపాలనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తీజీ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఉండాలంటే ధాన్యం చేయాలన్నారు. ధ్యానంతో శాంతి కలుగుతుందన్నారు. యువత శక్తి సంపాదించుకునే విధంగా ఏకాగ్రతతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. యనమలకుదురు వాటర్ ప్లాంట్‌రోడ్డుకు చెందిన చాగంటిపాటి గంగా భవాని కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమెకు శివాలయం సెంటర్‌లో జనరల్‌స్టోర్స్ షాపు ఉంది. అయితే ఆదివారం ఆమె వద్దకు స్థానికుడు బత్తుల మదన్ అనే వ్యక్తి వచ్చి అసభ్యంగా ప్రవర్తించి దూషించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

28 మందిపై బైండోవర్ కేసు

పెనమలూరు: ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు 28 మంది వ్యక్తుల పై సోమవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తారన్న అనుమానంతో ముందస్తు చర్యల్లో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన 28 మంది వ్యక్తుల పై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కంకిపాడు: అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని కంకిపాడు పోలీసులు అదుపులోకి తీసుకుని, 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని ఈడుపుగల్లు, పోలీసులు గ్రామాల్లో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోర్టు కొత్త భవనం నిర్మించాలని వినతి

గన్నవరం: స్థానిక కోర్టు భవన సముదాయం పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని న్యాయ శాఖ కార్యదర్శి సత్యప్రభాకర్‌కు గన్నవరం బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం అమరావతి సచివాలయంలో ఆయనను కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తిరివీధి వెంకయ్య, జాస్తి తాతారావు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత కోర్టు భవన సముదాయం శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉందన్నారు. ఆ స్థానంలో కొత్త భవనాన్ని త్వరితగతిన నిర్మించాలని కోరారు.

కుటుంబాలు ఐక్యంగా జీవించాలి



ఉంగుటూరు: కుటుంబ సభ్యులంతా ప్రేమానురాగాలతో ఐక్యంగా జీవించాలని నెల్లూరు మేత్రాసనం, బీవీనగర్ విచారణ ఫాదర్ విక్టర్ అన్నారు. పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాల నవదిన ప్రార్థనలు సోమవారం కొనసాయి. క్రైస్తవ కుటుంబం జీవితం అనే అంశంపై సందేశం అందించారు. క్రైస్తవ కుటుంబాలకు క్రీస్తు ఏసు అధిపతి అని, ఆయన యందు విశ్వాసముంచిన ప్రతి కుటుంబం వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. ఫాదర్ పాలడుగు జోసఫ్ ప్రార్థనలో పాల్గొన్న గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. విచారణ ఫాదర్లు అభిలాష్ గోపు, ప్రవీణ్ గోపు, మద్దాల రవి, కిషోర్, దిరిశం జయప్రసాద్ పాల్గొన్నారు.

ఆటల పోటీలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భార్గవి

విజయవాడరూరల్: ఈ నెల 10వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను విజయవంతం చేయాలని విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని 9 గ్రామాలకు సంబంధించిన క్రీడా పోటీలు నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబాడీ, ఖో ఖో, బ్యాట్మింటన్ పోటీలు నున్నలో జరుగుతాయన్నారు. మైలవరం నియోజకవర్గంలోని గ్రామాలకు గొల్లపూడి ఎస్‌పిఎస్ఆర్‌సీ హైస్కూల్లో వాలీబాల్, కబాడీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ జరుగుతాయని, కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలను పండుగ వాతావరణంలో జరిగేలా చూడాలని గ్రామ పంచాయతి కార్యదర్శులకు సూచించారు. మండలంలోని 32 సచివాలయాల నుంచి 21 టీములు పాల్గొంటాయన్నారు. సమావేశంలో పంచాయతి కార్యదర్శులతో పాటు పీడీలు, వలంటీర్లు, డిజిటల్ అసిసెంట్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడా పరికరాల పంపిణీ



యువతకు క్రీడా పరికరాలు అందజేస్తున్న గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్

కంకిపాడు: ఆడుదాం ఆంధ్రాతో క్రీడాభివృద్ధి సాధ్యమని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. గ్రామస్థాయి ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమం సోమవారం స్థానిక సచివాలయం వద్ద నిర్వహించారు. క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా విజయ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతిభ గల క్రీడాకారులు ఆసక్తిగల క్రీడాంశాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత ఉపాధి నైపుణ్య శిక్షణ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ పద్మలత

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాల, సీఎస్‌సీ అకాడమీకి పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్‌సీ అకాడమీ సలహాదారు వై. రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలత ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రామ్మోహనరావు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతర్జాల విషయాలు, సాంకేతికత మీద ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అధ్యాపకులు, విద్యార్థులకు 3డి ప్రింటింగ్, జీవశాస్త్ర అనుసంధానం, ప్రాథమిక ఆంగ్లభాష విషయాలపై వాధ్వాని ఫౌండేషన్ ద్వారా ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపక శిక్షణ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానం సాధించిన ఆరుగొలను జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెకుముకి సైన్స్ సంబరాలు పేరిట జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో బాపులపాడు మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రభుత్వ పాఠశాలల కేటగిరిలో ఆరుగొలను జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ప్రైవేట్ స్కూల్స్ కేటగిరిలో వీరవల్లి వాణి విద్యానికేతన్ విద్యార్థులు జిల్లా ప్రథమ బహుమతులు సొంతం చేసుకున్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన చెకుముకి క్విజ్ పోటీల్లో సత్తా చాటిన ఆరుగొలను జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కె.లిఖిత, ఎస్.షేభారాణి, కె.వాహినిలను ప్రధానోపాధ్యాయుడు టి.దుర్గాప్రసాద్, పాఠశాల సిబ్బంది సోమవారం అభినందించారు. ప్రైవేట్ పాఠశాల కేటగిరిలో జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిల్చిన వీరవల్లి వాణి విద్యానికేతన్ విద్యార్థులు టి.శ్రీవైష్ణవి, ఎం.ఐశ్వర్య, ఎస్కే జలీలాలను పాఠశాల కరస్పాండెంట్ నందిగం రవికుమార్ అభినందించారు. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయుడు సీహెచ్ వినాయకరాజును ఆయన అభినందించారు. ఈ నెల 27, 28 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు జిల్లా తరుపున ఆరుగొలను జెడ్పీ హైస్కూల్, వీరవల్లి వాణి విద్యానికేతన్ విద్యార్థులు హాజరుకానున్నారు.

నేడు చలివేంద్రపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామ సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. సోమవారం ఆమె వివరాలు తెలుపుతూ దావులూరు సచివాలయ పరిధిలోని చలివేంద్రపాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గొల్లనపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తామని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. గొల్లనపల్లి సచివాలయం వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఆరోగ్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. పెద అవుటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కరీం , సిబ్బంది గ్రామస్తులకు వైద్య సేవలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

నవరత్నాలతో ఆర్థిక తోడ్పాటు



సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న శంకర్‌రెడ్డి, ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: నవరత్నాలు పేదల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. నందమూరు గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం, జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా రూ.16 కోట్లు లబ్ధి చేకూరిందని ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. అనంతరం అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ వల్లమూడి సరోజిని, సర్పంచ్ బేబి, ఎంపీటీసీ సభ్యులు ప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, బాలస్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

ది. 08-01-2024 ... 9490784148